సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



గగన మార్గానికి సుగమం

అన్నవరం సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికోసం తుని- అన్నవరం మధ్య స్థలం సేకరణ జరిగింది.


II లో



కథ అడ్డం తిరిగింది..

ఆటో డ్రైవర్ మృతి కేసులో కొత్త కోణం బయట పడింది.. భార్యే ప్రియుడితో కలసి చంపిందని బంధువులు అనుమానిస్తున్నారు. వారిద్దరూ పారిపోతుండగా గ్రామస్తులు పట్టుకున్నారు.

39 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 39,347 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9 వేల క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

పోలీసులకు క్రీడా ఉత్సవం అవసరం

- ఎస్పీ నరసింహ కిశోర్
- వార్షిక పోలీస్ స్పోర్ట్స్ మీట్-2024 ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ప్రకాశం నగర్: పోలీసులకు క్రీడా ఉత్సవం ఎంతో అవసరమని, ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వార్షిక పోలీస్ స్పోర్ట్స్ మీట్-2024ను క్రీడా పతాకాన్ని ఎగురవేసి క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' ఎంతో దోహదపడుతుందన్నారు. 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీసు సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, క్రీడా ప్రతిభకు గుర్తింపునిస్తాయన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీస్ మీట్‌కు పంపిస్తామన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మీట్‌లో 7 జోన్లకు సంబంధించిన 7 జట్లు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, టెన్నిస్, షెటిల్ వంటి క్రీడల్లో తలపడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు బొమ్మూరులోని కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ఉదయం పది గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పన అధికారి అధికారి హరిశ్చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్, ఐటీఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో మూడు ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ఐటీఐ, డిప్లొమా, బీటెక్- ఎలక్ట్రికల్ / మెకానికల్, ఎంబీఏ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ముందుగా https://forms.gle/D6WEKfExZ3 aYcFCU9 లింక్‌లో పూర్తి వివరాలతో రిజిస్టరై జాబ్‌మేళాకు రెస్యూమ్‌తో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జెరాక్సులతో హాజరుకావాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 73967 40041, 90636 48365 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

డీఆర్వోగా సీతారామమూర్తి



సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లా రెవెన్యూ అధికారిగా టి.సీతారామమూర్తి నియమితులయ్యారు. విశాఖపట్నంలో ల్యాండ్ అక్విజిషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీఆర్వోను తిరుపతికి బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు వెలువరించారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపికలు



కార్యక్రమంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐ దిలీప్ కుమార్

ప్రకాశం నగర్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14 బాలురు, బాలికాల అథ్లెటిక్స్ ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, డీవైఈవో నారాయణ, డీఐ పి.దిలీప్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి కేవీ స్వామి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల నాలుగో తేదీన శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రసాద్, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

పింఛన్లపై పచ్చపాతకం!

- సామాజిక భద్రత పింఛన్ల తొలగింపునకు కుట్ర
- అనర్హత చూపి చర్యలు
- 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- కొత్త పింఛన్లపై కానరాని స్పష్టత





వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇళ్లకు, ఆస్పత్రులకు వెళ్లి పింఛన్లు అందజేసిన వలంటీర్లు (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: అభాగ్యులపై కూటమి ప్రభుత్వం 'పచ్చ'పాతం చూపుతోంది. ఆర్థిక ఆసరాగా ఉన్న సామాజిక భద్రత పింఛన్లను భారీగా తొలగించేందుకు కుట్ర పన్నుతోంది. పింఛను సొమ్ము పెంచినట్లు చెప్పుకుంటూనే భారీగా తొలగింపులకు శ్రీకారం చుట్టింది. కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడిస్తూనే అనర్హత సాకుగా చూపి ఉన్న వాటిని తీసేందుకు అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు ఇలా పింఛను లబ్ధిదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొందరు తమ పింఛను ఉంటుందా.. ఊడుతుందా..? అన్న సందిగ్ధం వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక శాతం మంది ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అలాంటప్పుడు ఆర్థిక ఆసరా పోతే తమ పరిస్థితి ఏంటన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా..

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అడ్డగోలుగా తొలగించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందుకు గాను 50 రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని నమ్మబలుకుతూనే ఉన్న వాటిలో అనర్హతలను గుర్తించే పనిలో ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమైంది. ఈ మేరకు జిల్లా అధికారులకు సెర్ప్ మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అనర్హత పేరుతో అత్యధికంగా పింఛన్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్న విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. జిల్లా వ్యాప్తంగా 20 వేలకు పైగా పింఛన్ల తొలగింపునకు త్వరలోనే ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో మూడు వేలకు పైగా పింఛన్లు తొలగించినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది.

ఆ వర్గాలే లక్ష్యంగా..

పింఛన్ల కోతలో ప్రధానంగా కొన్ని వర్గాలపైనే యంత్రాంగం దృష్టి పెడుతోంది. అనర్హతను గుర్తించే పనిలో డీఆర్‌డీఏ అధికారులు ఇప్పటికే సర్వే నిర్వహించారు. ఒంటరి మహిళ, డప్పు కళాకారులు, వికలాంగులు, వృద్ధులు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, చర్మకారులు, అభయహస్తం పింఛన్లపై వారు దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది.

50 ఏళ్లకే పింఛన్ హామీ పరిస్థితి ఏమిటో!

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే 50 ఏళ్ల వారికి పింఛను మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలుగా కావస్తున్నా హామీపై నేటికీ అతీగతి లేదు. అసలు ఇస్తారా..? లేదా..? అన్న విషయమై స్పష్టత కరువైంది. జిల్లా వ్యాప్తంగా 50 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు సుమారు 2 లక్షల మంది ఉంటారు. వీరందరూ హామీ అమలు కోసం నిరీక్షిస్తున్నారు. నెలలు గడుస్తున్నా కొత్త పింఛను దరఖాస్తులు తీసుకోవడమే తప్ప.. ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి వారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి వెళ్లి అర్జీలు ఇవ్వడం.. వెనుదిరిగి రావడం మినహా చేసేది లేక మిన్నకుండిపోతున్నారు.

టీడీపీ నేతల పెత్తనం

వైఎస్సార్ సీపీ నేతలు, సానుభూతిపరుల పేర్ల తొలగింపునకు టీడీపీ నేతలు అడ్డగోలు వ్యవహారానికి తెర తీస్తున్నారు. వారి పింఛన్లు తొలగించే ప్రక్రియకు నాంది పలికారు. జిల్లాలో ఈ తంతు కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నడుస్తోంది. తాజాగా లబ్ధిదారుల ఎంపికలోనూ పచ్చపెత్తనం పెరుగుతోంది. తాము చెప్పిన వారికే కొత్త పింఛను మంజూరు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. తమకు నచ్చని వారికి వైఎస్సార్ సీపీ ముద్ర వేసి తొలగించేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పింఛన్లలో సైతం ఎవరిని తొలగించాలన్న జాబితా ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది. టీడీపీ నేతలు ఇచ్చే జాబితాల్లో ఉన్న వారికి నోటీసులు ఇచ్చి అనంతరం వారి పింఛన్లను తొలగించేందుకు రంగం సిద్ధమవుతోంది. తెలుగు తమ్ముళ్ల సిఫార్సులు ఉన్న వారికే కొత్తగా పింఛన్లు మంజూరవుతాయన్న చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది జనవరి మాసం నుంచి తిరిగి జన్మభూమి-2 కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. జన్మభూమి కమిటీలు సైతం తిరిగి ఆవిర్భవించే అవకాశాలు సైతం కనిపిస్తున్నాయి. ఇదే జరిగిన మరుక్షణమే తిరిగి ముడుపుల సంస్కృతికి తెర లేవనుంది. తమకు డబ్బులు ముట్టజెప్పిన వారికే పింఛన్లు మంజూరయ్యే పరిస్థితి రానున్నదనే ఆందోళన ప్రజల్లో ఉత్పన్నమవుతోంది.

గత ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. మధ్యవర్తులు, దళారులతో పనిలేకుండా దరఖాస్తు చేసుకున్న వెంటనే పింఛన్లు మంజూరు కావడం అనంతరం వచ్చే ఒకటో తేదీనే నగదు అందేది. ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్తవి అందజేసేవారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు పింఛన్లు మంజూరయ్యేవి.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 2,39,021 పింఛన్లు అందజేస్తున్నారు. వీటిలో అత్యధికంగా వృద్ధులు 1,17,177 మంది ఉండగా, వితంతువులు 64,376 మంది ఉన్నారు. చేనేత కార్మికులు 1304, మత్స్యకారులు 1889, ఒంటరి మహిళ 9107, వికలాంగులు 32,622 మంది పింఛన్లు పొందుతున్నారు. వీటితో పాటు మిగిలిన వారికి కలిపి ప్రతి నెలా రూ.101 కోట్లు పంపిణీ చేస్తున్నారు.

మండలం	పింఛను లబ్ధిదారులు
అనపర్తి	10339
బిక్కవోలు	10646
చాగల్లు	9377
దేవరపల్లి	11006
గోకవరం	10570
గోపాలపురం	9136
కడియం	11955
కోరుకొండ	12321
కొవ్వూరు	10170
కొవ్వూరు అర్బన్	3195
నల్లజెర్ల	11534
నిడదవోలు	10479
నిడదవోలు అర్బన్	4276
పెరవలి	10332
రాజమండ్రి అర్బన్	28952
రాజమండ్రి రూరల్	19728
రాజానగరం	15443
రంగంపేట	8899
సీతానగరం	11586
తాళ్లపూడి	7864
ఉండ్రాజవరం	10443

రిబ్బన్ కట్‌చేస్తే సరా.. భద్రత వద్దా?

- మోరంపూడి ఫ్లైఓవర్‌పై లైట్లు రోడ్డు మార్జిన్లు.. స్కూట్ వర్క్ ఎక్కడ?
- అధికారులు, ప్రజాప్రతినిధులపై మాజీ ఎంపీ మార్గాని ధ్వజం



నాయకులతో కలసి ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: అధికారులు, ప్రస్తుత పాలకులు ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం ఉదయం మోరంపూడి ఫ్లై ఓవర్‌ను పలువురు వైఎస్సార్ సీపీ నేతలతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిబ్బన్ కట్‌చేయాలన్న ఆతృత తప్ప ఫ్లైఓవర్‌పై ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు దృష్టి లేదని ఆయన అన్నారు. 15 ఏళ్లుగా ఉన్న ప్రభుత్వాలు ఈ ఫ్లైఓవర్‌ను పట్టించుకోలేదని తాను ఎంపీ అయ్యాక కేంద్ర ప్రభుత్వంతో పోరాడి సాధించానని పేర్కొన్నారు. ఇంత చేశాక కూడా కనీసం దీనిపై లైటింగ్ ఏర్పాట్లు, రోడ్డు మార్జిన్లు ఏర్పాటు చేయలేకపోయారని పేర్కొన్నారు. విశాఖ- విజయవాడ జాతీయ రహదారికి మధ్యలో ఉన్న ఈ జంక్షన్‌లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులకు లేదా అని భరత్ ప్రశ్నించారు. ప్రస్తుత పాలకులైనా ఈ విషయాలపై ఇంగితం ప్రదర్శించాలి కదా అన్నారు. జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదని భరత్ ప్రశ్నించారు.

హైవే పక్కన మద్యం దుకాణాలా?

హైవే పక్కనే మద్యం దుకాణాల ఏర్పాటుకు అధికారులు ఎలా అనుమతిచ్చారని భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని జేఎన్ రోడ్డులో పెట్టిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని, లేకుంటే కోర్టుకు వెళ్లడానికైనా సిద్ధమని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట వడ్డి మల్లికార్జున్ ప్రసాద్, గుర్రం గౌతమ్, బొప్పన సుబ్బారావు, మజ్జి అప్పారావు, చీరా రాజు, కడియాల లక్ష్మణరావు, సోమన శ్రీనివాస్, వివిధ డివిజన్ల నేతలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఇసుక

- నిత్యం వెయ్యి టన్నులు తవ్వాలి
- బోట్స్‌మన్ సొసైటీలకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో నిత్యం కనీసం వెయ్యి మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వేలా బోట్స్‌మన్ సొసైటీలు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు ప్రజలు ఇసుకను అందుబాటులో ఉంచాలని ఆమె అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ వినియోగదారునికి సక్రమంగా ఇసుకను అందుబాటులో ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే డిసిల్టేషన్ పాయింట్లను బోట్స్‌మన్ సొసైటీలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. చిన్న రీచ్‌ల నుంచి వెయ్యి మెట్రిక్ టన్నులు, పెద్ద రీచ్‌ల నుంచి 2500 నుంచి 3 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను నిత్యం అందుబాటులో ఉంచేలా తవ్వకాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే తొలి దఫాలో 44 సొసైటీలకు అనుమతులు ఇవ్వగా, రెండో దశలో మరో 74 సొసైటీలకు అనుమతులు ఇచ్చామన్నారు. కొత్తగా గుర్తించిన 74 బోట్స్‌మన్ సొసైటీలకు రీచ్‌లు కేటాయించాలన్నారు. జిల్లాలో గుర్తించిన 17 ఓపెన్ రీచ్‌లలో నీటి నిల్వలు ఉండడం వల్ల ఇంకా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని, వాటిలో 16 రీచ్‌లకు డీఎల్ఎస్‌సీ అనుమతులు జారీ చేశామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అవి అందుబాటులోకి వస్తే 11.88 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులోనికి వస్తుందని, రానున్న రెండు మూడు రోజుల్లో వాటి ద్వారా కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు ఇసుక రీచ్ స్థాయికు అనుగుణంగా తవ్వకాల కోసం లక్ష్యం నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సీజ్ చేసిన, ఇసుక నిల్వ ఉంచిన పాయింట్లలోని ఇసుకను ఆఫ్‌లైన్‌లో ప్రభుత్వ పనులకు కేటాయించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు రానీయొద్దని ఆమె సూచించారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వని మిల్లర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని మిల్లర్లకు వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో బ్యాంకు గ్యారంటీ జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణ కు ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని కోరామన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.చిన్న రాముడు, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవోలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ కె.తిలక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అస్సాగో' సమస్య పరిష్కారానికి కమిటీ

గుమ్మళ్లదొడ్డిలోని అస్సాగో ఇథనాల్ ఇండస్ట్రీస్ ద్వారా ఉత్పన్నమైన సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఇందు కోసం సమన్వయ శాఖల అధికారులు, గ్రామస్తులు, అస్సాగో పరిశ్రమ ప్రతినిధులతో కలసి సమస్య పరిష్కార కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో పరిశ్రమలు, పర్యావరణ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడుతూ కమిటీలో రెవెన్యూ, పరిశ్రమలు, పర్యావరణ, తదితర శాఖల అధికారులను నియమించినట్లు తెలిపారు. కమిటి సభ్యులు పరిశ్రమలో కాలుష్య ప్రభావం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామస్తులు పేర్కొన్న అభ్యంతరాలు పై అధ్యయనం చెస్తారన్నారు. సమావేశం లో ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి ఈఈ ఎంబీఎస్ శంకరరావు, ఇండస్ట్రీస్ ప్రమోషనల్ అధికారి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

సాగుదారు హక్కు చట్టం అమలుపై సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: భూ యజమాని, పట్టాదారు హక్కులకు ఎటువంటి భంగం కలుగకుండా సాగు హక్కు కల్పించడనే ఆంధ్రప్రదేశ్ నూతన సాగుదారుల హక్కుల చట్టం 2024 లక్ష్యమని కలెక్టరు పి.ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ చట్టం అమలుపై సూచనలు, సలహాల స్వీకరణకు ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. గతంలోని కౌలుదారు చట్టాల్లో లోపాలను అధిగమించి ఈ చట్టాన్ని రూపొందించినట్లు ఆమె తెలిపారు. నూతన చట్టం ద్వారా కౌలు రైతులను ఖరీఫ్ రబీ సీజన్లో మాత్రమే గుర్తిస్తామన్నారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు వి.శ్రీధర్, జేసీ ఎస్.చిన్న రాముడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు చట్టం విధివిధానాలను కౌలు రైతులకు సాగుకార్డుపై వివరించారు.

నేటి నుంచి పశుగణన

జిల్లాలో శుక్రవారం నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు 21వ భారత పశుగణన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో ఈ మేరకు ఆమె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో స్థానిక పశువైద్యాధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి పశు సంపద వివరాలను సేకరించి గుమ్మానికి ఒక స్టిక్కర్‌ను అతికించాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ సూపర్‌వైజర్లు, ఎన్యూమనేటర్లుకు ఇప్పటకే గణనపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో 1.16 లక్షల కుటుంబాలు ఈ రంగంలో నిమగ్నమై ఉన్నాయని, జంతు సంక్షేమాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో పశుగణన చేయాలని కోరారు.

ప్రత్యేక ప్రోత్సాహం పక్కకు..

- దివ్యాంగులకు అందని విద్య, ప్రయాణ భత్యాలు
- ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు



భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావం తుడికి ఫిజియోథెరపీ సేవలు

రాయవరం: ఏ పథకం చూసినా ఏముందీ.. అన్నీ కోతలే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి ఇది. ప్రత్యేక ప్రతిభావంతులకూ అందించే సాయంలోనూ జాప్యం చేస్తోంది.. దివ్యాంగులను భవిత కేంద్రాలకు తీసుకు వచ్చేందుకు తల్లిదండ్రులు/ సంరక్షకులకు ఏటా ప్రభుత్వం అలవెన్స్‌లు అందజేస్తోంది. రవాణా, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, బాలికా విద్య స్టైఫండ్ పేరుతో ప్రోత్సాహకాలను సమగ్ర శిక్ష ద్వారా ఇస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అక్టోబర్ మాసాంతానికి చేరువవుతున్నా నేటికీ ఆ సొమ్ము విడుదల కాలేదు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు ప్రత్యేక ప్రోత్సాహకాల విడుదలకు ఆయా తల్లిదండ్రులు ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది.

సహిత విద్య ఎందుకంటే..

సకలాంగులైన చిన్నారులతో సమానంగా ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ప్రభుత్వం సహిత విద్యను ప్రవేశపెట్టింది. ఈ పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా మానసిక, శారీరక ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. వారిలో లోపాలను అధిగమించడానికి భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మాటలు రాని, మానసికంగా ఎదుగుదల లేని పిల్లలు ఇళ్లలోనే ఉండి మరింత మానసికంగా కృంగిపోకుండా భవిత కేంద్రాలకు తీసుకు వచ్చి తీర్చిదిద్దుతున్నారు. అక్కడ వారికి ఆటపాటలు, ఇతర పరికరాలతో సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. అలాగే శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. గృహ ఆధారిత విద్య ద్వారా ఇటువంటి చిన్నారుల్లో శారీరక, మానసిక పరివర్తన తీసుకు వచ్చేందుకు ఐఈఆర్‌పీలు ఇంటికి వెళ్లి శిక్షణ ఇస్తున్నారు.

విడుదల చేసే ప్రోత్సాహకాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకు వచ్చేందుకు తల్లిదండ్రులు/ సంరక్షకులకు ప్రభుత్వం ఏటా వివిధ రకాల అలవెన్స్‌లు మంజూరు చేస్తోంది. రవాణా, హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, బాలికా విద్య స్టైఫండ్ పేరుతో ప్రోత్సాహకాలను అందజేస్తోంది. రవాణా అలవెన్స్‌ను ఒక్కో విద్యార్థికి నెలకు రూ.300, హోమ్‌బేస్డ్ అలవెన్స్ నెలకు రూ.300, రీడింగ్ అలవెన్స్ నెలకు రూ.300లు, గర్ల్ ఎడ్యుకేషన్ స్టైఫండ్ కింద నెలకు రూ.200 చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది.

ఎందుకింత ఆలస్యం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా సేవలు పొందుతున్న విభిన్న ప్రతిభావంతులు, పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు గత ప్రభుత్వం ప్రోత్సాహకాలు విడుదల చేసింది. అర్హుల ఖాతాల్లో అలవెన్స్‌లు జమ చేసింది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 2023 జూలైలోనే అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.33.96 లక్షలు జమ చేసింది. 2023-24కి సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో గత ప్రభుత్వం రూ.35.18 లక్షలు విద్యార్థుల ఖాతాల్లో జమ చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రత్యేక ప్రోత్సాహకాల విడుదలలో జాప్యం జరుగుతోంది. ఒక్కో విద్యార్థికి 10 నెలలకు హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ కింద 220 మందికి రూ.6.60 లక్షలు, రవాణా చార్జీలుగా 469 మందికి రూ.14.07 లక్షలు, ఎస్కార్ట్ అలవెన్స్ కింద 405 మందికి రూ.12.15 లక్షలు, గర్ల్ స్టైఫండ్ కింద 913 మందికి రూ.18.26 లక్షలు చిన్నారుల తల్లుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కాకినాడ జిల్లాలో హోమ్ బేస్డ్ అలవెన్స్ కింద 210 మందికి రూ.6.30 లక్షలు, గర్ల్ స్టైఫండ్ కింద 1,307 మందికి రూ.26.14 లక్షలు, రవాణా చార్జీల కింద 830 మందికి రూ.24.90 లక్షలు, ఎస్కార్ట్ అలవెన్స్ కింద 792 మందికి రూ.23.76 లక్షలు చెల్లించాలి. తూర్పు గోదావరి జిల్లాలో హోమ్ బేస్డ్ అలవెన్స్‌గా 190 మందికి రూ.5.70 లక్షలు, బాలికల స్టైఫండ్‌గా 1,020 మందికి రూ.20.40 లక్షలు, రవాణా చార్జీలుగా 589 మందికి రూ.17.67 లక్షలు, ఎస్కార్ట్ అలవెన్స్‌గా 475 మందికి రూ.14.25 లక్షలు చెల్లించాల్సి ఉంది.

త్వరలోనే జమ చేస్తాం



ఈ విద్యా సంవత్సరానికి ఇటీవలే నిధులు మంజూరయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆమోదంతో త్వరలోనే చిన్నారుల తల్లుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తాం. ఎవరికీ ఇబ్బంది రాకుండా చూస్తాం.

– ఎ.మధుసూదనరావు, డిప్యూటీ కలెక్టర్ మరియు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, అమలాపురం

జాబితాలు సిద్ధం చేస్తున్నాం



విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తున్నాం. భవిత కేంద్రాల వారీగా జాబితాలను సిద్ధం చేస్తున్నాం. 22 భవిత కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నాం.

– ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్

క్లుప్తంగా

వ్యాన్ డ్రైవర్ మృతి

తుని రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తుని రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి కథనం ప్రకారం.. తుని మండలం చేపూరు సమీపంలో కోడిగుడ్లతో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. దీంతో విజయనగరం జిల్లా గొర్లి మండలానికి చెందిన వ్యాన్ డ్రైవర్ కల్యాణపు గురుమూర్తి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే మండలానికి చెందిన క్లీనర్ రౌతు రాము గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

తాళ్లపూడి: స్థానిక సాయిబాబా ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గురువారం తెల్లవారు జామున ఆలయానికి వచ్చిన అర్చకుడు చోరీ జరిగినట్టు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారం తాళాలు రాకపోవడంతో మరోవైపు ఉన్న కిటికీని పగులగొట్టి దుండగుడు లోపలకు ప్రవేశించాడు. ఆలయంలోని పెద్ద ఇనుప హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. అది తెరుచుకోకపోవడంతో పక్కనే ఉన్న చిన్న స్టీల్ డిబ్బీలోని సొమ్ము తీసుకుపోయాడు. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ సంఘటనా ప్రదేశంలో సీసీ ఫుటేజీలు, చోరీకి పాల్పడిన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.

వివాహితపై చాకుతో దాడి

తాళ్లపూడి: వివాహితపై ఓ వ్యక్తి చాకుతో దాడి చేశాడు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం.. తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన వ్యక్తితో ఓ వివాహితకు ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి హరినాథ్ అనే వ్యక్తి తిరుగుడు మెట్టకు వచ్చి భర్త, బావ ఉన్న సమయంలో ఆమెను చేయి పట్టుకుని లాక్కుని వెళ్లడానికి ప్రయత్నించాడు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేయగా బావతో పాటు ఆమెను చాకుతో పీకకోసే ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో ఆమెకు పొట్టపై, బావకు చేతి వేలికి గాయమైంది. వారిద్దరినీ స్థానికులు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

వెన్నెల మృతదేహానికి పోస్టుమార్టం




మడికి గౌతమీ గోదావరి తీరంలో పోస్టుమార్టం చేస్తున్న అధికారుల బృందం

ఆలమూరు: మడికి శివారు చిలకలపాడులో అనుమానాస్పదంగా మృతి చెందిన చెక్కపల్లి వెన్నెల (15) మృతదేహానికి గురువారం పోస్టుమార్టం చేశారు. ఈ నెల 18న వెన్నెల తన నివాసంలో ఉరివేసుకుని మృతి చెందింది. దీనిపై మృతురాలి తండ్రి బాబీ ఐదు రోజులు ఆలస్యంగా ఈ నెల 22న ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు ఆదేశాల మేరకు రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ కేసు నమోదు చేయగా, ఎస్సై ఎం.అశోక్ దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా వెన్నెల మృతదేహాన్ని ఖననం చేసిన గోదావరి ఒడ్డుకు రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, వైద్యులు బృందం వెళ్లింది. తహసీల్దార్ ప్రకాష్‌బాబు నేతృత్వంలో స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మణిదీప్, శిరీష పోస్టుమార్టం నిర్వహించారు. మృతి నిర్ధారణకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. వెన్నెల మృతదేహాన్ని మళ్లీ యథావిధిగా ఖననం చేశారు. పోస్టుమార్టం వివరాలను త్వరితగతిన వెల్లడించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రకాష్ బాబు తెలిపారు.

గగన మార్గానికి సుగమం



- అన్నవరం సమీపంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు కసరత్తు!
- బెండపూడి, పీఈ చిన్నాయపాలెం గ్రామాల్లో భూ సేకరణ



భూముల సేకరణకు రూపొందించిన మ్యాప్

అన్నవరం: సత్యదేవుడు కొలువైన అన్నవరం సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికోసం తుని-అన్నవరం మధ్య స్థలం సేకరించాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కాకినాడ జిల్లా కలెక్టర్‌కు పంపిన లేఖ వివరాలు బయటకు వచ్చాయి. ఈ వివరాలను 'సాక్షి' సేకరించింది. మూడు నెలల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సంయుక్త సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇది కార్యరూపం దాల్చడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఆరు చోట్ల కొత్తగా ఎయిర్‌పోర్టులు నిర్మించాలని గత ఆగస్టులో జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు. చిత్తూరు జిల్లా కుప్పం, శ్రీకాకుళం జిల్లాతో పాటు కాకినాడ జిల్లాలోని అన్నవరం-తుని మధ్య, పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, పల్నాడు జిల్లాలోని నాగార్జున సాగర్, ప్రకాశం జిల్లాలో ఎయిర్‌పోర్టులు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు గాను ఆయా ప్రాంతాల్లో అనుకూలమైన స్థలాలను తెలపాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. దీని ప్రకారం అన్నవరం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి-16 సమీపంలోని సత్యదేవుని పాత నమూనా ఆలయం ఎదురుగా ఉన్న అన్నవరం, తొండంగి మండలంలోని పీఈ చిన్నాయపాలెం, బెండపూడి గ్రామ పరిధిలోని సుమారు 778 ఎకరాలకు గాను ఆయా రైతుల భూములకు చెందిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా సేకరించింది. ఈ వివరాలను ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు అందజేయగా, ఆ సంస్థ కేంద్ర ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి అందజేసింది. దీనిపై ప్రాథమిక సర్వే చేసిన అనంతరం భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం.

మరింత కసరత్తు జరగాలి: రెవెన్యూ వర్గాలు

అన్నవరం సమీపంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం స్థలం గుర్తింపు జరిగిందని రెవెన్యూ వర్గాలు పేర్కొన్నాయి. ఇది ప్రాథమిక అంచనా మాత్రమే. భూసేకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలి. ఇంకా దీనిపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. త్వరలోనే జిల్లా స్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తారని వారు తెలిపారు.

ఎయిర్‌పోర్టుకు సేకరించే భూములివే..

బెండపూడి గ్రామ పరిధిలో 1,222 మంది రైతులకు చెందిన 510 ఎకరాలు, పీఈ చిన్నాయపాలెం గ్రామాల పరిధిలో 448 మంది రైతులకు చెందిన 268.07 ఎకరాలను గుర్తించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రయాణికుల రాకపోకలు అంచనా వేసి నాలుగు రకాల ఎయిర్‌పోర్టులను నిర్మిస్తారు. 3సీ టైపు ఎయిర్ క్రాఫ్ట్ దిగేందుకు వీలున్న ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి 200 ఎకరాల భూమి అవసరం. 3సీ టైపు ఎయిర్‌పోర్ట్‌లో వీఎఫ్ఆర్, ఐఎఫ్ఆర్ రకం నిర్మాణానికి 350 ఎకరాలు, 4సీ టైపు ఎయిర్‌పోర్టు నిర్మాణా**నికి 600 ఎకరాలు, 4ఈ టైపు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 1,200 ఎకరాల భూమి అవసరం. అన్నవ**రంలో 4సీ టైపు ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగే అవకాశం ఉందని అంటున్నారు. కేంద్ర ఎయిర్‌పోర్టు అభివృద్ధి సంస్థ గైడ్‌లైన్స్ ప్రకారం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సేకరించే భూమి నిర్మాణాలకు అనువుగా ఉండాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బతినేలా ఉండకూడదు. అదే విధంగా ట్రాన్స్‌పోర్టు సదుపాయాలు ఉండాలి. ఇవన్నీ ప్రస్తుతం గుర్తించిన భూమికి ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు.

అన్నవరం సమీపంలోనే ఎందుకంటే...

అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు నిత్యం సత్యదేవుని దర్శనానికి వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అన్నవరం దేవస్థానాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు గాను ప్రసాద్ పథకం కింద రూ. 20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచింది. అన్నవరం జాతీయ రహదారి-16ని ఆనుకుని ఉండడం, అదే విధంగా చెన్నై- హౌరా రైల్వే లైన్‌ను ఆనుకుని ఉండడం, అన్నవరానికి 12 కిలోమీటర్ల దూరంలో సముద్రతీర ప్రాంతంలో వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు, అన్నవరం నుంచి కాకినాడ పోర్టు వరకూ తొండంగి, యు.కొత్తపల్లి మండలాల మీదుగా నాలుగు లైన్ల 'సాగరమాల' రోడ్డు నిర్మిస్తుండడం, అదే విధంగా కాకినాడ పోర్టు నుంచి అన్నవరం రైల్వే స్టేషన్‌కు గూడ్స్ రైళ్లు నడిచేందుకు వీలుగా రైల్వేలైన్ ఏర్పాటు.. తదితర అనుకూలతలతో ఈ ప్రాంతాన్ని ప్రాథమికంగా ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనల ప్రకారం కాకినాడ జిల్లాలో తుని- అన్నవరం పట్టణాల మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థల సేకరణ చేయాల్సి ఉంది. అన్నవరం కన్నా అనువైన ప్రాంతం లేకపోవడంతో దీనిని ఎంపిక చేశారు.

మద్యం దుకాణం వద్దంటూ నిరసన



ఏలేశ్వరంలో నిరసన ర్యాలీ చేస్తున్న మహిళలు, స్థానికులు

ఏలేశ్వరం: జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ ఏలేశ్వరంలో గురువారం మహిళలు, స్థానికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వం మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేసిన రోజు నుంచి స్థానికంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధాన రహదారిని ఆనుకుని జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేయడం దారుణమన్నారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారి ఆనుకుని ఎన్టీఆర్ విగ్రహం నుంచి పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ చేసి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం మహిళలు, విద్యార్థినులు రాకపోకలు సాగించే ప్రదేశం, ఇళ్లకు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. దుకాణం ఏర్పాటు విరమించుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ పైల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, సిరిపరపు రాజేష్, జామి ఆదినారాయణ, జామి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కథ అడ్డం తిరిగింది..

- ఆటో డ్రైవర్ మృతిలో కొత్త మలుపు
- భార్యే ప్రియుడితో కలసి చంపిందని బంధువుల ఆరోపణ
- పారిపోతుండగా పట్టుకుని పోలీసులకు అప్పగింత



మృతుడు బత్తిన మధుబాబు (ఫైల్)



ఏవీ నగరంలో శిరీష, ప్రశాంత్‌లను పోలీసులకు అప్పగించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

తొండంగి: కథ అడ్డం తిరిగింది.. ఐదు రోజుల కిందట జరిగిన ఆటో డ్రైవర్ మృతి కేసులో కొత్త కోణం బయట పడింది.. భార్యే ప్రియుడితో కలసి చంపిందని బంధువులు అనుమానిస్తుండగా, వారిద్దరూ పారిపోతుండగా బంధువులు, గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన తొండంగి మండలం ఏవీ నగరంలో గురువారం చర్చనీయాంశమైంది. మృతుని సోదరుడు, సోదరి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఏవీ నగరం గ్రామానికి చెందిన బత్తిన మధుబాబు (38)కు ఇదే గ్రామానికి చెందిన అతని మేనమామ డేగల ప్రకాష్ కుమార్తె శిరీషతో 2014లో వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల జాయ్ అనే పాప ఉంది. ఆటో డ్రైవర్‌గా మధుబాబు జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి తమ్ముడు కిషోర్, చెల్లెలు ఝాన్సీరాణి ఉన్నారు. తల్లిదండ్రులు చాలాకాలం కిందట మృతి చెందారు. కాగా కిషోర్ కాకినాడ ఆర్టీసీలో మెకానిక్‌గా చేస్తున్నాడు. శిరీష నర్సుగా కొంత కాలం కిందట కత్తిపూడి రిఫరల్ ఆస్పత్రిలో పనిచేసింది. అక్కడ పనిచేసిన సమయంలో శంఖవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ విషయం తెలిసిన మధుబాబుకు, శిరీషల మధ్య తరచూ మనస్పర్థలు వచ్చాయి. దీంతో భర్తను విడిచి శిరీష హైదరాబాద్‌లో చెల్లెలు ఇంటికి కుమార్తెను తీసుకుని వెళ్లిపోయింది. 20 రోజుల కిందట శిరీష హైదరాబాద్‌లో కుమార్తె జాయ్‌ను ఉంచి మళ్లీ ఏవీ నగరంలోని మధుబాబు ఇంటికి వచ్చింది. ఈ నెల 17న మధుబాబుకు బీపీ తక్కువగా ఉందని కత్తిపూడిలో రిఫరల్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు శిరీష 18న కాకినాడలో ఉంటున్న మరిది కిషోర్‌కు తెలిపింది. దీంతో ఏవీ నగరంలో తన స్నేహితుడిని ఆస్పత్రికి వెళ్లమని చెప్పి అనంతరం కిషోర్ ఆస్పత్రికి చేరుకున్నాడు. అనంతరం మధుబాబుకు పలు పరీక్షలు చేయాలని వైద్యులు సూచించడంతో శుక్రవారం ఏవీ నగరంలో ఇంటికి వచ్చారు. ఆ రోజంతా ఆరోగ్యంగానే మధుబాబు గ్రామంలో తిరిగాడని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం చనిపోయాడని శిరీష అతని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారంతా కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. మధుబాబు ఒంటిపై గాయాలున్నట్టు కిషోర్ చూసి శిరీష ప్రవర్తనపై అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో ఐదు రోజుల అనంతరం బుధవారం అర్ధరాత్రి శిరీషతో అక్రమ సంబంధం ఉన్న పీతల ప్రశాంత్ గ్రామంలోకి రావడం, వీరిద్దరూ పారిపోతుండగా పట్టుకున్నామని మృతుని సోదరుడు కిషోర్, చెల్లెలు భర్త చిన్న తెలిపారు. పట్టుబడిన వారిని పోలీసులకు అప్పగించారు. అక్రమ సంబంధం కారణంగా ప్రియునితో కలసి తన అన్నను హతమార్చారని కిషోర్, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మధుబాబు మృతి మిస్టరీగా మారింది.

అనుమానాస్పద మృతిగా కేసు

ఏవీ నగరంలో మధుబాబు మృతిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితులిద్దరినీ అరెస్టు చేసినట్టు ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహిస్తామన్నారు. కేసు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.

అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



బాస్కెట్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజీయెట్ బాస్కెట్ బాల్ మెన్స్ టోర్నమెంట్, యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ గురువారం ప్రారంభమయ్యాయి. వీటిని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. 42 రకాల క్రీడా పోటీలు జరుగుతున్నాయని, ఇందులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని గ్రామీణ యువత పాల్గొని సత్తా చాటాలన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారు. ఇక్కడ అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జట్లను, క్రీడాకారులను వచ్చే నెల ఒకటి నుంచి ఐదు వరకూ బెంగళూరులో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డ్ కోఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, డాక్టర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి: కేసు నమోదు



ఎల్.గన్నవరం సీతమ్మ కాలనీలో విచారణ చేస్తున్న సీఐ భీమరాజు

పి.గన్నవరం: పక్షవాతంతో మంచానికే పరిమితమైన వృద్ధురాలిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరం గ్రామంలో జరిగింది. ఎస్సై బి.శివకృష్ణ కథనం ప్రకారం.. ఐ.పోలవరం మండలం జి.మూలపాలేనికి చెందిన లక్ష్మి (60)కి రెండేళ్ల కిందట పక్షవాతం రావడంతో అప్పటి నుంచి ఆమె మంచానికే పరిమితమైంది. గతంలో ఆమె భర్త మరణించాడు. దీంతో నాలుగు నెలల కిందట పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరం గ్రామంలోని డొక్కా సీతమ్మ కాలనీలో నివసిస్తున్న కుమార్తె లలితాదేవి ఇంటికి వచ్చి ఉంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో జరిగిన ఫంక్షన్‌కు కుమార్తె వెళ్లింది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన లంకే సత్యనారాయణ ఆ వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఎస్సై వివరించారు. ఫంక్షన్ నుంచి సాయంత్రం కుమార్తె ఇంటికి తిరిగి వచ్చింది. జరిగిన విషయం తెలుసుకుని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఆర్.భీమరాజు గురువారం పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు.

బస్టాండ్‌లో బ్యాగ్ చోరీ అంటూ ప్రచారం

రావులపాలెం: స్థానిక బస్టాండ్‌లో బ్యాగ్ చోరీ జరిగినట్టు గురువారం సోషల్ మీడియాలో సీసీ టీవీ ఫుటేజ్ హల్‌చల్ చేసింది. బ్యాగ్‌లో విలువైన వస్తువులు ఉన్నాయని, రెండు కాసుల బంగారం నక్లెస్, కాసు చైను, అరకాసు మాటీలు, 62 తులాల పట్టీలు, రూ. 11 వేలు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో పాటు దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చినట్టు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై టౌన్ సీఐ శేఖర్ బాబును వివరణ కోరగా.. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన తాడిగడప సుబ్బలక్ష్మి ఆత్రేయపురం మండలంలో ఒక ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం పెంటపాడు నుంచి రావులపాలెం బస్సులో వచ్చింది. బస్టాండ్ బయటకు వచ్చి ఆటో ఎక్కే క్రమంలో తీసుకువచ్చిన బ్యాగ్ మర్చిపోయి వెళ్లిపోయింది. గంట తర్వాత మళ్లీ సెంటర్‌కు వచ్చి చూడగా అక్కడ బ్యాగ్ కనిపించలేదని, దీంతో స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. జరిగింది చోరీ కాదని, బ్యాగ్ మర్చిపోయి వెళ్లిపోయినట్టు గుర్తించామని సీఐ అన్నారు. దీంతో ఆ మహిళను, ఆమె బంధువులను తీసుకుని తమ సిబ్బంది బస్టాండు తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించినట్టు తెలిపారు. బ్యాగులో విలువైన వస్తువులన్నట్టు మహిళ ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఇదిలాఉంటే గురువారం రాత్రి వరకూ దీనిపై ఎటువంటి కేసు పోలీసులు నమోదు చేయలేదు. కేసు నమోదు చేయకుండా రహస్యంగా పోలీసులు చేపట్టిన దర్యాప్తు వెనుక మర్మమేమిటో అర్థం కాక సోషల్ మీడియాలో ఈ పోస్ట్ వైరల్ అయింది.

ఆటోల ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు



ఏడీబీ రోడ్డులో ప్రమాదానికి గురైన ఆటోలు

పెద్దాపురం: మూడు ఆటోలు ఢీకొన్న ఘటన గురువారం ఉదయం పెద్దాపురం శివారు దుర్గమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం వైపునకు వెళ్తున్న ఆటో అటుగా వస్తున్న ఆటోను ఢీకొంది. వెనుక వస్తున్న మరో ఆటో సైతం వాటిని ఢీకొనడంతో మూడు ఆటోలు అదుపు తప్పాయి. కాగా ఆ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

స్వామిని చూడగ.. మది మురవగ



స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



వేంకటేశ్వరునికి తిరుప్పావడ సేవ

వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో అలరించిన నృత్యరూపకం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు తిలకించిన ప్రతి మదీ పులకిస్తోంది.. గోదారిలా పరవళ్లు తొక్కుతోంది. ఈ ఉత్సవాలను చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఉదయం తీర్థ బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్వామివారికి అభిషేకాలతో పాటు గోత్రనామాలతో పూజలు, నిత్య హోమాలు చేశారు. అనంతరం నివేదన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను వేదపండితులు వైఖానస యువబ్రహ్మ ఆగమ భాస్కర శ్రీఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధర్‌రావు అందించారు. ఉదయం పుణ్యాహవచనం, అష్టకలశారాధన, తిరుప్పావడ సేవ, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, స్వామివారికి విశేష అర్చన, చతుర్వేద స్వస్తి అనంతరం యోగ నారసింహ అలంకరణలో సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు జరిగింది.

సింహ వాహన సేవ విశిష్టత

స్వామి వారికి సింహ వాహన సేవ జరిగింది. ఆ సమయంలో స్వామివారు వజ్ర ఖచిత కిరీటంతో సకల ఆభరణాలతో అలంకృతమై ఉంటారు. జంతు జాలానికి రాజైన సింహాన్ని మృగత్వానికి ప్రతీకగా భావిస్తారు. ప్రతి మనిషి తమలోని మృగత్వాన్ని సంపూర్ణంగా అణిచి ఉంచాలని తలపైన ఆది దేవుడిని ధరించాలని చెప్పే ప్రతీకగా ఈ సింహ వాహనంపై స్వామివారు ఊరేగుతారని భక్తులు భావిస్తారు.

నేటి కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అష్టకలశారాధన, తోమాల సేవ, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు, మలయప్ప అలంకరణతో గరుడ వాహన సేవ తదితర పూజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ చక్రధర్‌రావు తెలిపారు.



• పుప్పొడి నేత
పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే!
వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే!
అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి.
అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది.
'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్ ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



శివాని నేత

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్ల భామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ



మన్నిదా బాను

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు ఢీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సైన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.

స్త్రీ శక్తి



రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై-రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్ట్‌లకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్ట్‌ల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో-పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి



అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికేట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.



పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.

– వీఎమ్‌ఆర్
ఫోటోలు: ఎస్‌ఎస్ ఠాకూర్



సూజీ బ్రెడ్

హెల్దీ డైట్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; **ఇన్‌స్టంట్ ఈస్ట్** – టీ స్పూన్; **చక్కెర పొడి**– టేబుల్ స్పూన్; **ఉప్పు** – పావు టీ స్పూన్; **పాలు** – 3 టేబుల్ స్పూన్‌లు; **నీరు** – అర కప్పు; **నూనె** – 2 టేబుల్ స్పూన్‌లు; **వెన్న** – టీ స్పూన్; **సీడ్స్** – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి
ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో ఆటోనో స్కూటరో కారో బుక్ చేయొచ్చు. వస్తుంది. కాని ఒంటెను బుక్ చేయొచ్చా? దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు ఎడారిలో తప్పిపోయారు. ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు. ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు. ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైకులు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని చాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.